పంపుహౌస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల రైతులు

బొమ్మకూర్ పంపుహౌస్ వద్ద రైతుల ఆందోళన

నీళ్లు విడుదల చేసి పంటలను కాపాడాలని నిరసన

నర్మెట, మార్చి 17: దేవాదుల నీటిని నమ్ముకునే వరి పంటలను సాగు చేశామని, పొట్టదశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు వెంటనే బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. నీళ్లు ఇవ్వకుంటే మాకు చావే శరణ్యమని ఆవేదన చెందారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్, ధర్మారం గ్రామాల రైతులు సోమవారం నర్మెట మండలంలోని బొమ్మకూర్ రిజర్వాయర్ పంపుహౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లద్నూర్ రిజర్వాయర్‌కు బొమ్మకూర్ పంపుహౌస్ ద్వారా గ్రేటా సాగునీటిని విడుదల చేసేవారని తెలిపారు. దీంతో భూగర్భ జలాలు పెరిగేవని తెలిపారు. ఈ యాసంగి పంటలకు నీళ్లు విడుదల చేయకపోవడంతో వరి, ఇతర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టదశకు వచ్చి పంట ఎండుతుంటే రైతుల గుండెలు తరుక్కుపోతున్నాయని ఆందోళన చెందారు. వెంటనే నీటిని విడుదల చేయాలని దేవాదుల ఎత్తిపోతల పథకం డీఈ శ్రీధర్, ఏఈ వెంకన్నకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లద్నూర్ మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, కాసర్ల కనకరాజు, పాకాల ఆదాం, నంద శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, కాసర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో రైతులు సభ్యత్వం తీసుకోవాలి

బచ్చన్నపేట, మార్చి 17 : మండలంలోని ఆయా గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన రైతులకు పీఏసీఎస్‌లో సభ్యత్వం లేకుంటే దరఖాస్తు చేయాలని సొసైటీ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, సీఈవో కాశ బాలస్వామి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం కలిగి ఉంటే ఎన్నికల్లో ఓటేసే అవకాశం ఉంటుందని, రుణాలు తీసుకునే వీలు కలుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులందరూ పట్టాదారు పాస్‌బుక్, వన్ బీ, ఆధార్, ఫొటోలతో పీఏసీఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటి వరకు పీఏసీఎస్ ద్వారా ఎంతో మంది రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇచ్చామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన వారికి మళ్లీ ఇస్తారని ఆయన తెలిపారు.

కామారెడ్డిగూడెంలో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో ముస్లింలు

దేవరుప్పుల, మార్చి 17: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని కామారెడ్డిగూడెం మసీదు ఆవరణలో మహ్మద్ గోరే సాహెబ్ సోమవారం రాత్రి ఇఫ్తార్ విం దు ఇచ్చారు. ముస్లింల మత గురువు ఇనాయత్ రసూల్ మాట్లాడుతూ ముస్లింలు తమ సంప్రదాయాలను పాటిస్తూ సమాజసేవలో ముందుండాలని కోరారు. పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణ మూర్తి, పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గులాం రసూల్, మసీదు అధ్యక్షుడు జాకీర్, రబ్బానీ, షబ్బీర్, అబ్బాస్, ఖలీల్, ఖాజా, పాషా పాల్గొన్నారు

పదోన్నతిపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం

యాదగిరిని సన్మానిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు, మార్చి 17 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మేకల యాదగిరికి ఇటీవల హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్‌కు ప్రమోషన్‌పై వెళ్తున్న యాదగిరిని స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సునీల్, కిరణ్, అనిల్, ఇంద్రాచారి, రమ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903
NTW-332480

SHORT TERM COACHING

★Sri Chaitanya Junior College, Uppal. 45 Days BiPC-NEET and MPC-EAMCET. Contact: K. ASHOK REDDY, AO. Cell: 9441884705
NTW-000

PLOT FOR SALE

★హైదరాబాద్‌లో మరో న్యూయార్క్ లాంటి 4వ సిటీ మహేశ్వరం, ముచ్చర్ల, కందుకూరులో ప్లాట్లు, విల్లాలు & ఇండ్లు అమ్మబడును. శ్రీశైలం హైవేకి మహర్దశ... ఆలస్యం చేయకండి... నేడు తక్కువ ధరలో కొనండి - రేపు కోటీశ్వరులు కండి. మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్ రూ. 6,000/-కే గజం. సంప్ర: 8008091512.
NT-330660

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

‘పది’ పరీక్షలకు సంసిద్ధులు కావాలి

- విద్యార్థులు మరోసారి రివిజన్ చేసుకోవాలి
- జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

విద్యార్థులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మార్చి 17 : జిల్లాలో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సంసిద్ధులు కావాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరుకాబోయే పలువురు విద్యార్థులతో కలెక్టర్ మీటింగ్ ద్వారా ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 6,238 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలని సూచించారు. ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యంపై కూడా శ్రద్ధకనబర్చాలన్నారు. ఇప్పటికే చదివి పూర్తి చేసిన సబ్జెక్టులను మరోసారి రివిజన్ చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పరీక్షకు హాజరయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ తోడ్పాటునందించాలని కోరారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా, మండల టాపర్లుగా ప్రతిభకనబర్చిన విద్యార్థులకు, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు బహుమతులు, అవార్డులు అందజేస్తామని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్, ఏసీజీ రవికుమార్, ఏఎంవో శ్రీనివాస్, జీసీడీవో గొసియా బేగం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ ఫస్టియర్ థియరీ వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగాయి. తొమ్మిదో రోజు జిల్లాలోని 17 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 4678 మంది హాజరుకావాల్సి ఉండగా, 4440 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్, డీఐఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. మరో 238 మంది గైర్హాజర్ అయినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 94.91 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆయన వెల్లడించారు. జనగామ పట్టణంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఇంటర్ పరీక్షల నిర్వహణ జిల్లా కమిటీ చైర్మన్, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు, స్క్రైబ్ విధానం గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, టాయిలెట్స్, అత్యవసర వైద్య శిబిరం వంటి మౌళిక వసతుల గురించి ఆరా తీశారు. వేసవి కావడంతో విద్యార్థులకు అవసరమైన ఓఆర్‌ఎస్ ద్రావణం ప్యాకెట్లు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఐఈవో జితేందర్‌రెడ్డి, డీఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరు సర్కారు పోస్టులు సాధించిన వెల్దండ వాసి

జనగామ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధుల్లో చేరిన సంధ్య

జనగామలోని ప్రభుత్వ బాలికల కళాశాల వద్ద సంధ్య

నర్మెట, మార్చి 17: కృషి ఉంటే రుషులవుతారని పెద్దలు చెప్పినట్లుగా పట్టుదల, అంకితభావంతో చదివి పోటీ పరీక్షల్లో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు మండలంలోని వెల్దండకు బైరగోని పరశురాములు సతీమణి సంధ్య(పల్లవి). చిల్పూరు మండలం మల్కాపూర్‌కు చెందిన బండారి సంధ్య(పల్లవి) అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ స్టేషన్ ఘన్‌పూర్‌లో పూర్తి చేశారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశారు. 2012లో వెల్దండకు చెందిన బైరగోని పరశురాములుతో వివాహం జరుగగా ఇద్దరు కుమారులు కలిగారు. కుటుంబసభ్యులు, భర్త ప్రోత్సాహంతో 2009 నుంచి 2018 వరకు బాసర ట్రిబుల్ ఐటీ కళాశాలలో కెమిస్ట్రి ఫ్యాకల్టీగా విధులు నిర్వహించారు. 2018లో గురుకుల పోస్టు గ్రాడ్(పీజీటీ) టీచర్‌గా చేరి వరంగల్ వెస్ట్ స్కూల్‌లో విధులు నిర్వహించారు. అదే సమయంలో గురుకుల టీజీటీ, జేఎల్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డులో గ్రేడ్-2 ఉద్యోగాలు సాధించి, 2019వ సంవత్సరంలో గురుకుల కళాశాలలో డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించి జగద్గిరిగుట్టలో విధులు నిర్వర్తించారు. ఇటీవల ప్రకటించిన జూనియర్ కళాశాల లెక్చరర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించి జనగామ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ.. పట్టుదల, కార్యదీక్ష ఉంటే ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు.

అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగాల రాజేందర్

గానుగుపహాడ్‌లో అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ

జనగామ రూరల్, మార్చి 17 : మండలంలోని గానుగుపహాడ్ పాఠశాలలో 2009లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు దివంగత భారత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేయగా రిటైర్డ్ ఎంఈవో వంగాల రాజేందర్ సోమవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దివంగత అబ్దుల్‌కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బంజరలో గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

దేవరుప్పుల, మార్చి 17: మండలంలోని బంజరలో గుడుంబా స్థావరాలపై స్థానిక ఎస్సై సృజన్‌కుమార్ నేతృత్వంలో సోమవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. బానోత్ శ్వేత ఇంట్లో గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్వేత ఇంట్లో 20 కిలోల పటిక బెల్లం, 50 కిలోల సాధారణ బెల్లం, 200 లీటర్ల బెల్లం పానకం కలిపించింది. వీటితో పాటు తయారు చేసిన రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. బెల్లం పానకాన్ని పారబోసి శ్వేతపై కేసు నమోదు చేశారు. గుడుంబా తయారు చేయడం, విక్రయించడం నేరమని ఎస్సై పేర్కొన్నారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రైతులకు భరోసా ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

జనగామ చౌరస్తా, మార్చి 17 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించినా రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా మూలంగా పంటలకు సాగునీరందక వేలాది ఎకరాలు ఎండిపోయాయని తెలిపారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడకపోగా రైతుల గోడును పట్టించుకోలేదని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను విస్మరించారని తెలిపారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి పెట్టుబడిగా అప్పులు తెచ్చిన రైతులు వరి, మక్కజొన్న పంటలు వేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీరు అందక ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేశ్, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాశ్, పోత్కనూరి ఉపేందర్, బెల్లంకొండ వెంకటేశ్, మునిగల రమేశ్, చిట్యాల సోమన్న, కోడెపాక యాకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీటి కోసం గ్రామాల్లో పాదయాత్ర

సీపీఐ జిల్లా నాయకుడు జువారి రమేశ్ వెల్లడి

పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్, మార్చి 17 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందించాలనే డిమాండ్‌తో ఈ నెల 22, 23 తేదీల్లో గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యుడు జువారి రమేశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. రమేశ్ మాట్లాడుతూ ఈ నెల 22న మండలంలోని ముగ్దుంతండాలో పాదయాత్ర ప్రారంభించి, 23న స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వరకూ కొనసాగిస్తామన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తానని పలుమార్లు హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆచరణలో విఫలమయ్యారని తెలిపారు. గోదావరి జలాలను చెరువులు, కుంటల్లో నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి నీరు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాదయాత్ర చేపడుతున్నామని రమేశ్ వివరించారు. దీనిని విజయవంతం చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ యాకూబ్‌పాషా, పెండ్యాల సమ్మయ్య, రడపాక సత్తయ్య, ఎండీ జాఫర్, నాగరాజు, సురేందర్, మల్లయ్య, కిరణ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిఖిల్ శ్రీవల్లి

పాలకుర్తి, మార్చి 17: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరుల తో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. 100 మీటర్ల పరుగు పందెంలో గుంజె శ్రీవల్లి, 400 మీటర్ల పరుగు పందెంలో లకావత్ నిఖిల్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ఉపాధ్యాయులు ఓరుగంటి రమేశ్, గుగులోత్ బలరాం, నర్సింహమూర్తి, ఆశోక్‌కుమార్, మరియా, జతృత, రవి, మాలతి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


వినయ్ (ఫైల్)

చిల్పూరు,మార్చి 17 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన హనుమకొండ మండలం ఎల్కుర్తి సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నష్కల్‌కు చెందిన చేగొండ వినయ్ (22) బైక్‌పై సోమవారం నష్కల్‌కు వస్తుండగా ఎల్కుర్తి క్రాస్ రోడ్డు వద్ద కోళ్ల వ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో వినయ్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. వినయ్ మృతితో నష్కల్‌లో విషాదం నెలకొంది.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

కొడకండ్ల, మార్చి 17 : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం మండలంలోని ఏడునూతులలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులకు చెందిన గీత కార్మికుడు ఎలికట్టె వెంకన్న సోమవారం తాటి చెట్టు ఎక్కాడు. దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స కోసం కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఆరు గ్యారెంటీల అమలులో రేవంత్‌రెడ్డి విఫలం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 17 : గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో అమలు చేయకపోగా అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు ఆరోపించారు. శివునిపల్లిలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ అబద్దాల బహిరంగ సభ అని విమర్శించారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో పాలనలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో కేవలం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగిలినవి అమలు చేయలేదన్నారు. ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు బస్సులను పెంచడం లేదన్నారు. అభివృద్ధి పనుల పేర ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దళితమోర్చా జిల్లా అధ్యక్షులు రడపాక ప్రదీప్, ఇల్లందుల సారయ్య, కుమ్మం సతీశ్, నాయకులు గోనెల శివకృష, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బుచ్చయ్య, శివ, కృష్ణ పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు నిందితుల రిమాండ్

జఫర్‌గఢ్, మార్చి 17 : మండలంలోని తీగారంలో ఈ నెల 14న గోనె ప్రవీణ్‌ను హత్య చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాంచరణ్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తీగారంలో హోళీ రోజున గోనె ప్రవీణ్‌ను హత్య చేసిన ఘటనలో తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన జంగిలి బాలరాజు, జంగిలి అనిల్, జంగిలి రాజశేఖర్, జంగిలి ప్రశాంత్‌ను నిందితులుగా గుర్తించామని ఎస్సై తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

కమ్మగాని వెంకటేశ్, పావని దంపతులను ఆశీర్వదిస్తున్న ఎర్రబెల్లి

ఒకే రోజు 46 వివాహాలు..

నూతన వధూవరులను ఆశీర్వదించి రికార్డు సృష్టించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, మార్చి 17: నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం.. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా విజయం సాధించారు.. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ర్టాల్లో అభిమానులు కలిగి ఉన్న ఆయనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా ప్రజలను నిత్యం కలుస్తుంటారు. వివాహ వేడుకలు, శుభకార్యాలు ఏవైనా ప్రజలు పిలిచారంటే చాలు హాజరవుతారు. చావైనా.. పెళ్లైనా.. ఆయన ఆత్మీయ పలకరింపునకు అక్కడే ఉండాల్సిందే. ఆదివారం ఒక్క రోజే 46 పెళ్లిళ్లు, రిసెప్షన్లు, పలు కార్యక్రమాలకు ఎర్రబెల్లి హాజరయ్యారు. పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, పెద్ద వంగర, తొర్రూరు, రాయపర్తి మండలాలతో పాటు పాత వర్ధన్నపేట నియోజక వర్గంలోని వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పదవి ఉన్నా లేకపోయినా నిత్యం జనం మధ్యలో ఉండే ప్రజా నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు అని ప్రజలు కొనియాడారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల : మండలంలోని చిప్పరాళ్ల బండ తండాలో బీఆర్‌ఎస్ నాయకుడు ధరావత్ చంద్రూనాయక్ కుమారుడు నర్సింహనాయక్ వివాహం శిరీషతో జరిగింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించి కానుకలకు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు తీగల దయాకర్, పల్లా సుందర్‌రాంరెడ్డి, బస్వ మలేశ్, ఏల సుందర్, చింత రవి, తాటిపల్లి మహేశ్, కడవెండి మాజీ సర్పంచ్ బాలూనాయక్, శ్రీను, కాలూనాయక్, రవి పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తరిగొప్పుల ఉన్నత పాఠశాలలో స్వయంపాలన

తరిగొప్పుల, మార్చి 17: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ఘనంగా స్వయం పరిపాలన నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. డీఈవోగా మడికొండ వంశీకృష్ణ, ఎంఈవోగా నేనావత్ ప్రశాంత్, ఉపాధ్యాయులుగా నేలకంటి కీర్తన, ఫిజికల్ డైరెక్టర్లుగా భూక్యా కరుణాకర్, గంజి రాజశేఖర్, వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థుల్లో ప్రథమ బహుమతిని ఆలేటి అఖిల్, ద్వితీయ బహుమతి ఖాతా విస్నిత, తృతీయ బహుమతిని భుక్యా చరణ్, కటకుంట్ల కార్తీక్‌కు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోత్ రవీందర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాలెపు విజయ, గాదె జోసెఫ్ బేబి, మహ్మద్ యూసుఫ్ పాషా, తాటిపల్లి పద్మ, ఆవుల అమర్‌నాథ్, అజహర్ సుల్తానా, తేజవత్ శ్రీనివాస్, పుప్పాల సుమలత, రవి, పాకాల కుమారస్వామి, గోపగోని సంధ్య పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో మాట్లాడుతున్న బాలరాజు

విద్యార్థులు కెరీర్‌పై శ్రద్ధ తీసుకోవాలి

లింగాలఘనపురం, మార్చి 17 : విద్యార్థులు తమ కెరీర్‌పై శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ కెరీర్ కౌన్సిలర్ ఐఐటీ చైన్నై నిపుణులు కొండవీటి బాలరాజు అన్నారు. మోడల్‌స్కూల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్‌ను చేరుకోవాలన్నారు. విద్యార్థి జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 17 : స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణి గురుకుల పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 1999 - 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన వీరంతా కలుసుకుని అందరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కష్ట సుఖాల్లో అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నాటి ఉపాధ్యాయులు రంగయ్య, సంపత్, వీరయ్య, టీవీ రాజు, గట్టు రాజు, కుమారస్వామి, శ్రీలతను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజు, రాకేశ్, కిరణ్, శ్రీకాంత్, వనం రవికిరణ్, సతీశ్, చందర్, తిరుమల్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల చేయూత

నర్మెట, మార్చి 17: మండలంలోని హన్మంతాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.1,50, 000 విలువైన క్రీడా పరికరాలను వైటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆసియా సంస్థకు చెందిన యువ ఇంజినీర్లు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హెచ్‌ఎం దూడల రమేశ్ అధ్యక్షత వహించగా సంస్థ ప్రతినిధి జొన్నల శ్రీనివాస్ గుప్తా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం క్రీడా పరికరాలను అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం కమల, ఉపాధ్యాయులు గుర్రాల కర్ణాకర్, సీఆర్పీ రవీందర్, అంగన్‌వాడీ టీచర్స్ మమత, స్వప్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఆశాలత, సభ్యులు ఇట్టబోయిన రాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో పీఏసీఎస్ చైర్మన్ ఆత్మహత్య

రవీందర్ (ఫైల్)

రఘునాథపల్లి, మార్చి 17: ఆర్థిక ఇబ్బందులతో పీఏసీఎస్ చైర్మన్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మండలకేంద్రానికి చెందిన చీమలపాటి రవీందర్(58) కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా విధులు నిర్వర్తించడంతో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, సొసైటీలో అవకతవకలు జరిగినట్లు ఇటీవల ఆయనపై ఫిర్యాదులు రావడంతో అధికారులు బహిరంగ విచారణ జరిపి రవీందర్ రూ.17 లక్షలు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించారు. దీంతో మండల కేంద్రంలో తనకున్న ఎనిమిది ఎకరాల భూమిలో ఎకరం 18 గుంటలు విక్రయించి ఆ మొత్తాన్ని చెల్లించాడు. దీనికి తోడు 2019లో సొసైటీ ఎన్నికల సమయంలో ఖర్చులు, ఇతరత్రా కలిపి సుమారు రూ.కోటి దాకా అప్పులయ్యాయి. అప్పటినుంచి తరచూ బాధపడుతుండేవాడు. ‘చైర్మన్ పదవి లేకున్నా అప్పులు కాకపోవు.. అన్నం పెట్టే వ్యవసాయ భూమిని అమ్మి కుటుంబ సభ్యులకు అన్యాయం చేశాను’ అంటూ కుటుంబసభ్యులతో తరచూ చెబుతూ దిగులు చెందేవాడు. ఈ క్రమంలో తీవ్ర మానసిన వేదనకు గురై ఈ నెల 8న తన వ్యవసాయ క్షేత్రంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియా వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌యాదవ్ తెలిపారు.